## సింగరేణి సీఎండీకిపర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు


సింగరేణి సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, జూన్ 1 : సింగరేణి సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎం డీ) ఎన్ బలరామ్ కు జాతీయ స్థాయి ట్రిపుల్ ఐఈ(ఇండియన్ ఇన్ స్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రీయల్ ఇంజనీరింగ్) సంస్థ వారు పర్ఫార్మెన్స్ ఎక్స్ లెన్స్ అవార్డు 2024ను ప్రకటించారు. ఉత్తరాకాండ్ రాష్ట్రంలోని మస్సోరీలో శుక్రవారం రాత్రి జరిగిన 24వ జాతీయ స్థాయి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, బొగ్గు రవాణాను సాధించి రికార్డు నెలకొల్పించి. అంతేకాదు 35,700 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం జరిగింది. దీంతో సింగరేణికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ వారు ఆయనకు వ్యక్తిగతంగా పెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు 2024ను బహూరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ నుండి జీఎం (ఎంఎస్)టీ సురేష్ బాబు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎన్ భాస్కర, డీజీఎం(ఐఈ) సీహెచ్ సీతారాంబాబు, ట్రిపుల్ ఐఈ గౌరవ కార్యదర్శి ఎవీవీ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులను గుర్తించాలి

### సీఎండీని కోరిన బీఎంఎస్

శ్రీరాంపూర్, జూన్ 1 : రాష్ట్ర సాధన కోసం పోరాడిన సింగరేణి ప్రాంత జర్నలిస్టులను గుర్తించి సత్కరించాలని బీఎంఎస్ ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ శనివారం యాజమాన్యాన్ని ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి కలం పోరాట యోదులు జర్నలిస్ట్ జాత పేరుతో తెలంగాణా జర్నలిస్ట్ ఫోరం(టీజేఎఫ్) ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా కార్మికుల కాలనీల్లో సాంస్కృతి కళాకారులచే ఉద్యమ చైతన్యం తీసుకవచ్చారన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో తెలంగాణా ఉద్యమ జర్నలిస్టులను సింగరేణి స్థాయిలో ఒకరిని, ఏరియా స్థాయిలో ఒకరిని ఎంపిక చేసి సత్కరించాలని కోరారు.

## కార్మికుడికి సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 1: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5గనిలో సీనియర్ ఎలక్ట్రిషన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మయ్యను శనివారం గనిపై మేనేజర్ అబ్దుల్ ఖాధర్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గుణిగంటి నర్సింగ రావులు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్క వాసు, బోగ మధు, గోదారి మురళి, జీపీ రావు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగిగా కే సంతోష్ ఎంపిక

కాసిపేట, జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ దినో త్సవ వేడుకలను పురస్కరించుకొని సింగరేణి మందమర్రి ఏరియా ఉత్తమ ఉద్యోగిగా మంద మర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనికి చెందిన కోల్ కట్టర్ కే సంతోశ్ ఎంపికైనట్లు మందమర్రి ఏరియా సింగరేణి యాజమాన్యం ప్రకటించిం ది. మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం తీసుకొనున్నారు.

# ఏఐటీయూసీ గుర్తింపును రద్దు చేయాలి

### టీబీజీకేఎస్ నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రి, జూన్ 1 : కార్మికుల సమస్యలపై ఏఐటీ యూసీ నిర్లక్ష్యం వహిస్తుందని యూనియన్ గుర్తింపును రద్దు చేయాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు బడికెల సంపత్‌కుమార్, బెల్లంపల్లి రీజియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఓ రాజశేఖర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే రవీందర్‌లు మాట్లాడారు. ముందుగా సింగరేణి బొగ్గు గని కార్మికులకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ధి ముగింపు ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న దశాబ్ధి ఉత్సవాల కార్యక్రమాలలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సింగరేణిలో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించి ఆరు నెలలు గడచినా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు గుర్తింపు పత్రాలు తీసుకోక పోవడం శోచనీయమన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు గడువును నాలుగేండ్లకు పెంచాలని కోరుతూ సింగరేణి యాజమాన్యం ద్వారా గుర్తింపు పత్రం తీసుకోకుండా దోబూచులాడుతోందని వారు అన్నారు. 2018లో జాతీయసంఘాలు గుర్తింపు గడువును రెండేళ్ళు మాత్రమే ఉండాలని సింగరేణి యాజమాన్యం, సీఎల్‌సీ, ఆర్ఎల్‌సీ సమావేశంలో ఒప్పందం చేసుకున్నాయని వారు గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికల్లో గెలిచి గుర్తింపు రావడంతో గడువును నాలుగేళ్లకు పెంచాలనడం ఎంతవరకు సబమని వారు ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు టీబీజీకేఎస్‌ను కూడా పిలవాలని వారు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. యూనియన్ గుర్తింపు గడువును రెండు సంవత్సరాలు మాత్రమే ఉంచాలని అందుకు ఏఐటీయూసీ అంగీకరించకుండా గుర్తింపు పత్రం తీసుకోనట్లయితే వారి గుర్తింపును రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు. గతేడాది సింగరేణి సంస్థ సాధించిన లాభాలలో 35శాతం వాటాను జూలైలోనే కార్మికులకు చెల్లించాలని వారు యాజమాన్యాన్ని కోరారు. అందుకు ఏఐటీయూసీ కృషి చేయాలన్నారు. టీబీజీకేఎస్ నాయకులు అశోక్, రాం చందర్, వీరారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, తిరుపతి ఉన్నారు.

## ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


ప్రగతిస్టేడియంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ముస్తాబైన వేదిక

శ్రీరాంపూర్, జూన్ 1: తెలంగాణా ఆవిర్భావ వేడుకలకు శ్రీరాంపూర్ ప్రగతీ స్టేడియం ముస్తాబైంది. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ప్రగతీ స్టేడియంలో యాజమాన్యం వివిధ స్టాల్లు ఏర్పాటు చేస్తున్నారు. ఫుడ్ స్టాల్లు, సూపర్ బజార్‌స్టాల్, ఎంవీటీసీ, రెస్క్యూ, వైద్యారోగ్యశాఖ స్టాల్లు ఏర్పాటు చేశారు. వేడుకల్లో బాగంగా సాంస్కృతికి కార్యక్రమా లు నిర్వహించనున్నారు. వాటర్ ఫౌంటెన్‌ను జీఎం బీ సంజీవరెడ్డి పరిశీలించారు. జీఎం ఆఫీస్, గనులు విధ్యుత్ దీపాలతో అలంకరించారు. వేడుకలకు ప్రగతీ స్టేడియంలో వేదికను సుందరంగా తీర్చిది ద్దారు. ప్రతీ కార్మికుడు, వారి కుటుంబ సభ్యులు వేడుకల్లో పాల్గొనాలని జీఎం సంజీవరెడ్డి కోరారు.

**ఉత్తమ అధికారి, కార్మికుడి ఎంపిక**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఆర్కే 7గనికి చెందిన డీవైఎస్ఈ కోజ వెంకటరామును ఎంపిక చేశారు. ఉత్తమ కార్మికుడిగా ఆర్కే 5గనికి చెందిన యాక్టింగ్ ఎస్‌డీఎల్ ఆపరేటర్ సీదిరాల మల్లారావును ఎంపిక చేశారు. ఉత్తమ కార్మికులుగా ఎంపికైన వారిని ప్రగతి స్టేడియంలో జీఎం సంజీవరెడ్డి సన్మానించనున్నారు.

## డీజీఎంను విధుల నుంచి తొలగించాలి


సీహెచ్‌పీ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సీసీసీ నస్పూర్, జూన్ 1 : శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీ డీజీఎం డీవీ రావును విధుల నుంచి తొలిగించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. డీజీఎం కార్మికులను ఇబ్బంది పెడుతు న్నాడని అతను వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ శనివారం నిర్వహించిన సేఫ్టీ కమిటీ మీటింగ్‌ను కార్మికులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లానింగ్ మజ్దూర్‌లను షిఫ్టులుగా మార్చి కార్మికులను మానసికంగా వేధిస్తున్నారని అన్నారు.కార్మికులపై వేధింపులు మానుకోకపోతే సీహెచ్‌పీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లతీఫ్, తిరుపతిరెడ్డి, ఆర్కాల శ్రీనివాస్, గుండా సత్త య్య పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాల్లో డబ్బులు మాయం

### సైబర్ క్రైం పోలీసులకు బాధితుల ఫిర్యాదు

రెబ్బెన, జూన్ 1: తమ ప్రమేయం లేకుండానే తమ బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు మాయం అయినట్లు బాధితులు పిట్టల సునీత, వడై హన్మంతరావు వాపోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మే 31 వ తేదీ శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రెబ్బెన శాఖలోని తమ ఖాతాల నుంచి తమ ప్రమేయం లేకుండానే డబ్బులు విత్‌డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయని తెలిపారు. తమ ఫోన్‌లు సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఫోన్ చేయడంతో పాటు వివిధ రకాల మెసేజ్‌లు పంపించారని తెలిపారు. తమకు తెలియకుండానే సునీత అకౌంట్ నుంచి రూ.50వేలు, హన్మంతరావు అకౌంట్ నుంచి రూ.7700 పోయినట్లు పేర్కొన్నారు. జూన్ 1వ తేదీ శనివారం 1930 నంబర్ ద్వారా సైబర్ క్రైం హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎంక్వైరీ చేస్తామని రసీదు అందించారనితెలిపారు.

## ఆర్కే 7పై సేఫ్టీ అవగాహన సదస్సు

శ్రీరాంపూర్, జూన్ 1 : శ్రీరాంపూర్ ఆర్కే 7గనిలో జూన్‌లో ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఉద్యోగి రక్షణ సూత్రాలు పాటించాలని జీఎం సంజీవరెడ్డి, కోరారు. శనివారం గనిపై సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, ఉద్యోగులచే ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని, రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేస్తామని జీఎం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏజెంట రాముడు, మేనేజర్ శ్రీధర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ అమర్నాధ్‌రెడ్డి, గని సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్, వత్స, ఈఈ ప్రవీణ్, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీశ్వర్‌రావు, ఫిట్ కార్యదర్శి బీర రవీందర్, సీనియర్ పీవో సంతన్ పాల్గొన్నారు.

## రక్షణ సూత్రాలపై అవగాహన

కాసిపేట, జూన్ 1 : మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై ఫ్యాటల్ ఫ్రీ జూన్ 2024 ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా గని రక్షణాధికారి సునీల్ కార్మికులు పాటించాల్సిన రక్షణ సూత్రాలపై అవగాహన కల్పించారు. ప్రతి కార్మికుడు చేసే పనుల వల్ల తనతో పాటు తన తోటి ఉద్యోగులకు కూడా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ , డీవై మేనే జర్లు నిఖిల్, వెంకటేశ్వర్లు, గని ఇంజనీర్ మధూకర్, అండర్ మేనేజర్ సుమన్, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్ రంజిత్, మురళి, హెడ్ ఓవర్ మెన్ శ్రీని వాస్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ బాయిబాట

జైపూర్, జూన్ 1 : ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం డివిజన్‌లోని ఇందారంఖని 1ఏ గనిపై ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్మికుల పనిస్థలాల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో ఫ్యాన్లు కుర్చీలతో పాటు, కూలర్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెల్లి పరిష్కరిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కళవేన శ్యామ్, ఏరియా సెక్రెటరీలు వెంగల కుమార స్వామి, చంద్ర మోహన్, గడ్డం మల్లయ్య, ఏరియా అసిస్టెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నీలం సదయ్య, ఏరియా నాయకులు జగదీశ్వర్‌రెడ్డి , మైన్ పిట్ సెక్రటరీ రామచందర్, మైన్ నాయకులు ఉదయ్, మధు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ అందించాలి

శ్రీరాంపూర్, జూన్ 1 : సింగరేణి కోల్‌బెల్ట్ మంచిర్యాల, శ్రీరాంపూర్ ఏరియాలో వడదెబ్బకు గురికాకుండా కార్మికులకు యజమాన్యం గనులు, ఓసీపీలపై ఔట్ మష్టర్ పడే సమయంలో ఓఆర్ఎస్, మజ్జిగ అందించాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. టీబీజీ కేఎస్ నాయకులు బండి రమేశ్, సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, సాదుల భాస్కర్, రాజునాయక్, ఎండీ లాలా పాల్గొన్నారు.

## వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూన్ 1: రాష్ట్ర సాధన సకల జనుల సమ్మెతో ఢిల్లీలో ప్రకంపనలు సృష్టించిన కార్మికులకు జూన్ 2న వేతనంతో కూడిన సెలవు దినంగా యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పోరాటం మరువలేనిదన్నారు. బీఎంఎస్ ఏరియా సంయుక్త కార్యదర్శి వినయ్‌కుమార్, సభ్యులు ప్రభాకర్, ఈశ్వరాచారి, రాజు, రాజేశం, తిరుపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

